
# పెంకాసులు



టీచర్ పాఠం చెపుతువున్నాడు. వెనక బెంచిలో స్వామి, సంపత్ గుసగుస లాడుకున్నారు. పాఠం చెప్పడం ఆపి, "ఏమిటిర ఆ గుసగుస" అడిగాడు.

ఏంలేదు అన్నట్టు చూశారు ఇద్దరు.

"చెప్పర స్వామి ఏం సంగతి"

స్వామి మాట్లాడలేదు.

"నేను చెప్పుత సార్" అంటు లేచి నిలుచున్నాడు సంపత్

"చెప్పు"

"సార్ ఈయన జేబులో పెంకాసులున్నాయి".

"ఔర స్వామి"

అవునన్నట్టు తలాడించాడు.

"ఇటుర"

వెళ్లి టీచర్ ముందు నిలుచున్నాడు. స్వామి జేబు నిండుగఉబ్బివున్నది.

"నీ జేబులో ఏం వున్నాయిర, ఏది తీసి ఈ టేబిల్ మీద పొయ్యి" అన్నాడు. స్వామి జేబులోని పెంకాసులను తీసి కుప్పపోసాడు.

"ఎక్కడ్ణ తెచ్చావురా, పెంటదిబ్బమీద ఏరుకుని తెచ్చావా ?"

అవును అన్నట్టు చూశాడు.

"పెంటదిబ్బ అంత చెండాలంగా వుంటుంది. దానిమీది పెంకులు ఏరుకుని నీవు జేబులో పోసుకున్నావు. తప్పుకదా ?" అన్నాడు టీచర్.

అవును, కాదు అనకుండ మౌనంగా నిలుచున్నాడు.

"వీటిని ఎందుకోసం ఏరుకున్నావు" టీచర్.

స్వామి మాట్లాడలేదు.

"అవి రూపాయలు అవుతాయట సార్" అన్నాడు సంపత్ ఏదోరహస్యం చెప్పినట్టు.

టీచర్ నవ్వుతూ "ఔర స్వామి"

స్వామి సిగ్గుపడుతు తలవంచుకుని నిలుచున్నాడు.

"పెంకాసులు రూపాయలు ఎట్లా అవుతాయిర"

"అయితయట సార్" సంపత్

"ఎవరన్నారు"

"స్వామే అన్నాడు సార్"

"అవుర స్వామి"

అవును అన్నట్టు తలాడించాడు.

"ఏది చెయ్యి చూస్తం" అన్నాడు టీచర్.

"చుట్టు తిప్పడానికి ఎముక కావాలి సార్"

అప్పుడు అర్థమైంది టీచర్కు. వీడు వీధిలో చూసినట్టుంది. తాను చెయ్యాలన్న ఆలోచన వచ్చినట్టుంది.

"స్వామి గారడివాడు చెయ్యంగ చూసినావుర" అన్నాడు స్వామి భుజాన్ని తాకుతు.

అవును అన్నట్లు నవ్వుముఖం పెట్టాడు స్వామి.

టీచర్ తాను నవ్వుతూ, "పాఠం రేపు చెపుతాను ఈ రోజు పెంకాసు రూపాయి ఎట్లా అవుతుందో చెపుతాను. పిల్లలు మీరందరు ఎప్పుడో ఓసారి గారడివాడి అట చూసివుండవచ్చు. అతను ఎన్నెన్నో మాయలు చేసి చూపెడతాడు. వాటిల్లో పెంకాసును రూపాయిగ మార్చడం ఒకటి. అట్లా చేయడాన్ని నేను చిన్నప్పుడు చూసి అబ్బుర పడ్డాను. పెంకాసు రూపాయిగ మార్చిండే ! ఈయన తనకు కావాల్సినప్పుడల్లా రూపాయిని చేసుకుంటాడేమో అనుకున్నాను. కాని మీరు కూడ అతన్నిచూసి వుండవచ్చు. అట ముగింపులో అందరిని పావలా - అర్ధరూపాయి అడుక్కొంటాడు."

"అవుసార్" అన్నారు ఒక్కసారే ఇద్దరు ముగ్గురు విద్యార్థులు.

"ఇక్కడ మీరు బాగ ఆలోచించండి".

విద్యార్థులందరు ఒకరిముఖాలు ఒకరు చూస్తు ఆలోచనల్లోకి వెళ్లారు.

"పెంకాసును రూపాయిగ మార్చె వ్యక్తి. తనకు అవసరమున్నప్పుడల్లా రూపాయిని చేసుకోవచ్చు. కానీ దేహి అని అడుక్కోవల్సిన అవసరం వుండదు."

పిల్లలు శ్రద్ధగా వింటువున్నారు.

"అంతెకదర"

"అవునుసార్" అన్నట్లు చూశారు.

"పెంకాసు రూపాయి ఎప్పటికి కాదు. తన ఆటసాగడానికి అలాగారడి చేస్తాడు. అంతే అదో నైపుణ్యం. హస్తలాఘవం. నిజంకాదు. అలాంటి ఆలోచనలు మీరు చేయకూడదు. స్వామి, వెళ్లి కూర్చో వీటన్నిటిని బయట పారెయ్యి" అంటు ముగిస్తాడు.

స్వామి పెంకాసులను తీసుకెళ్లి బయటపారవేస్తు "అవును అందరు పనిచేసే పైసలు సంపాదిస్తరు" అనుకున్నాడు మనస్సులో.

●